క్లుప్తంగా

## మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో అమ్మవారు

**పెద్దాపురం:** మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డ్రైన్లలో పూడికలు పూర్తిగా తొలగించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మున్సిపల్ అధికారులు

**సామర్లకోట:** డ్రైన్లలో పూడిక తొలగింపుపై స్థానిక అధికారులతో మున్సిపల్ ఆర్డీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని డ్రైన్లలో పూడికలు పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ పన్నులకు సంబంధించిన డిమాండ్ నోటీసుల జారీ పూర్తి చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలోని రోడ్లకు అడ్డుగా ఉన్న షాపులను తొలగించి, వారికి ఆర్థిక సాయం అందజేసి షాపులు అన్నీ ఒకేచోట ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఈ కె.శశిధర్, ఏఈ ఎం.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ఐ పి.సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్

**సామర్లకోట:** రైల్వే ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రైల్వే పోలీసులు గుర్తించి శుక్రవారం బాధితుడికి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నానికి చెందిన అరవింద్ స్థానిక రైల్వే స్టేషన్ వెయిటింగ్ హాల్‌లో సెల్ ఫోన్‌కు చార్జింగ్ పెట్టాడు. అయితే దుండగులు సెల్‌ఫోన్ అపహరించడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సీసీ కెమెరాలో సెల్ ఫోన్ చోరీ చేసిన దొంగను గుర్తించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ రికవరీ చేసి ఎస్సై వాసు ఆదేశాల మేరకు బాధితుడికి కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సెల్ ఫోన్‌ను అందజేశాడు.

## కిశోర బాలికలకు వేసవి శిబిరాలు

**కొత్తపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు వేసవి శిబిరాలను నిర్వహించనున్నట్టు సెక్టార్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు శ్రీలంవారి పాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాంలో జరుగుతున్న వేసవి శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరాలు జూన్ 10వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు తెలిపారు. కౌమార బాలకల సమస్యలు, పోషణ అవసరాలు, ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మ రక్షణ, కిశోరి వికాసం సెషన్-3, బాల్య వివాహాలు అంటే ఏమిటి? బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రజలు తమ వంతు ప్రయత్నం, మనం ఏం చేయాలనే విషయాలపై తల్లిదండ్రులు సైతం అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

**బోట్‌క్లబ్:** ప్రతి ఒక్కరికీ తూనికలు, కొలత్లపై అవగాహన అవసరమని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ సుధాకర్ అన్నారు. వీటి నివారణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ప్రపంచ తూనికలు, కొలతలు దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు వ్యాపార సంస్థల ప్రతినిధులతో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తూనికలు, కొలతల్లో మోసాలు, వాటి నివారణకు ప్రభుత్వం తీసుకునే చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వినియోగదారుల కోసం వ్యాపారస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వివిధ రకాల ప్యాకింగ్ వస్తువులు విక్రయాలపై అవగాహన కల్పించారు.

# సేవకు చాలదా సహృదయం!

- సమాజ సేవలో ఘన కీర్తి
- పైసా ఆశించకుండా నిర్వహణ
- వేసవి శిబిరాలతో ప్రజలు, విద్యార్థులతో మమేకం



పిఠాపురంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సహృదయ మిత్రమండలి



సహృదయ మిత్ర మండలి సభ్యులు

**పిఠాపురం:** ఒక చేయి చేస్తే సాయం. అదే పది చేతులు సంయుక్తంగా చేస్తే సహృదయం. పిఠాపురంలోని సహృదయ మిత్రమండలి అదే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. సమాజంలో బతుకుతున్నందుకు ఈ సమాజానికి ఏదైనా చేయాలనే ఆలోచనతో పది మంది కలిసి 2001లో ఈ సంస్థను స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ ప్రజలకు, విద్యార్థులకు ఎంతో చేరువైంది. చీకటిని తిడుతూ కూర్చోవడం కంటే చిరు దీపం వెలిగించాలన్న లక్ష్యంతో ఈ సంస్థ సభ్యులు పనిచేస్తున్నారు. కుల, మత, లింగ భేదాలు లేకుండా సామాన్యులు, వ్యాపారులు, మేధావులు, వివిధ కళల్లో నిష్ణాతులు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు.

### ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అనువుగా వివిధ కళల్లో నిష్ణాతులతో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. గత 25 ఏళ్లుగా స్థానిక ఆర్ఆర్బీహెచ్ఆర్ స్కూల్, రాజీవ్ గాంధీ మున్సిపల్ హై స్కూల్‌లో ఏడేళ్లుగా శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, సృజనాత్మక కళలు, దేశభక్తి ప్రబోధాత్మక గీతాలు, పపెట్ల తయారీ, చక్కటి దస్తూరి, బొమ్మలు గీయడం తదితర అంశాలను సైతం బోధిస్తున్నారు.

### జాతీయ దినోత్సవాలు నిర్వహణ

జాతీయ దినోత్సవం అంటే ఒక సెలవుగా భావిస్తున్న నేటి తరంలో దేశభక్తిని పెంపొందించడానికి ఆ ఉత్సవానికి కారణాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి ర్యాలీలు చేపడుతున్నారు.

**మండలి సేవలివీ..**

- 25 ఏళ్లుగా నిర్విరామ సామాజిక సేవలు.
- పేద విద్యార్థులకు ఏటా వేసవి శిక్షణ తరగతులు.
- మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ఎయిడ్స్, డ్రగ్స్, మత్తు పానీయాలు, కూల్ డ్రింక్స్ దుష్ప్రభావాలపై అవగాహన శిబిరాలు.
- దేశ నాయకుల జయంతి, వర్ధంతులు, వైద్య శిబిరాలు, ఉచిత శస్త్ర చికిత్సల నిర్వహణ.

### సాహితీ సేవలో..

సామాజిక చైతన్యంతో పాటు సాహితీ సేవలోను ఈ సంస్థ విశేష కృషి చేస్తోంది. విద్యార్థుల్లో రక్షణ పటిమను పెంపొందిస్తోంది. మహాకవి గురజాడ, వజ్రాయుధకవి ఆవంత్స సోమ సుందర్, స్వామి వివేకానంద, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన కవుల జయంతి నిర్వహిస్తోంది.

### మద్య, ధూమపాన వ్యతిరేక ప్రచారం

సహృదయ మిత్రమండలి మద్యపాన ,ధూమపాన ,ఎయిడ్స్, డ్రగ్స్, మొదలైన చెడు వ్యసనాలు పై శివ రాత్రి కుంతి మాధవ స్వామి తీర్థం తదితర ఉత్సవాలు జాతరలో ఈ సంస్థ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వాటిపై నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తుంది. అవయవ దానం తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

### ప్రకృతి వైపరీత్యాలలో ఆపన్న హస్తం

ప్రకృతి వైపరీత్యాల వేళ ఈ మిత్రమండలి సభ్యులు స్వచ్ఛందంగా సహాయం అందిస్తున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వయం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. హుద్‌హుద్, లైలా, జల్ తుపాను సమయాల్లో, కరోనా కల్లోల పరిస్థితుల్లో ఈ సంస్థ సభ్యులు ప్రజలకు సహాయం అందించారు.

### వేసవి సెలవులు సద్వినియోగం



నేను స్థానిక మున్సిపల్ హైస్కూలులో ఏడో తరగతి చదువుతున్నా. ఏటా సహృదయ మిత్ర మండలి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో పలు అంశాలపై శిక్షణ పొందుతున్నా. ఎటువంటి రుసుమూ లేకుండా సమాజ సేవే పరమావధిగా తమకు శిక్షణ ఇస్తోంది. చాలా మంది పేద విద్యార్థులు ఇంగ్లిషు, సైన్సు తదితర అంశాలపై శిక్షణ పొందుతున్నారు. దీని ద్వారా సెలవులు సద్వినియోగం అవుతున్నాయి.

– వి.సాయి దుర్గ

### సమాజ సేవ సంతృప్తినిస్తోంది



2007లో విద్యార్థిగా మిత్రమండలి నిర్వహిస్తున్న శిక్షణకు వచ్చాను. సొంత లాభం కొంత మానుకు పొరుగు వారికి తోడుపడవోయ్ అన్న గురజాడ వాక్యంతో ఇప్పటి వరకు సంస్థలో కొనసాగుతున్నా. సేవ చేయాలనే ఆలోచన ఉంటే తమతో కలిసి పని చేయవచ్చు. సహృదయులైన వ్యక్తులందరూ ఈ సంస్థలో సభ్యులే. ఈ సంస్థ ఏ ఒక్కరి బ్రెయిన్ చైల్డ్ కాదు. ఈ సంస్థ నాది.. నీది.. మన అందరిదీ. రోజులో అతికొద్ది సమయాన్ని సహృదయతో కలసి సమాజ సేవకు వినియోగించడం గర్వంగా ఉంది.

– చిన్నారి సతీష్, ప్రధాన కార్యదర్శి, సహృదయ మిత్రమండలి పిఠాపురం

## విద్యార్థుల నమోదుపై శ్రద్ధ చూపాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

**సామర్లకోట:** తరగతుల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉండేలా నమోదులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల, వేట్లపాలెం, మాధవపట్నం జెడ్పీ పాఠశాలలోని ఉపాధ్యాయులతో ఆయన సమీక్షించారు. ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరేళ్లు పూర్తయిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని విద్యార్థుల కోసం 70 శాతం పాఠ్యపుస్తకాలు, 100 శాతం నోట్ పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు అనురాధ, గోవిందరాజులు, ప్రసూన, టి.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

## 20 నుంచి విధుల బహిష్కరణ

**సామర్లకోట:** మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈ నెల 20 నుంచి పూర్తి స్థాయిలో విధులు బహిష్కరిస్తున్నట్టు యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల ఐదున కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని, అత్యవసర విభాగం దృష్ట్యా ఇన్నాళ్లు విధులు నిర్వహించామని, సమస్యలు పరిష్కరించకపోవడంతో 20వ తేదీ నుంచి పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొంటామని తెలిపారు.

# పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా!



పిఠాపురంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదా శోచనీయం
- పిఠాపురంలో జర్నలిస్టుల ఆందోళన

**పిఠాపురం:** అరచేతిని అడ్డు పెట్టి సూర్యుడిని ఆపాలనుకోవడం ఎంత మూర్ఖత్వమో చట్టాలను అడ్డు పెట్టుకుని అక్షరాన్ని ఆపాలనుకోవడం అంతే మూర్ఖత్వమని జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి దిన పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు చొరబడి గంటల తరబడి వేధింపులకు దిగడం పై పిఠాపురం జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు ప్రకాష్, లోవరాజు, పల్లవరాజు, జోజిబాబు నాగేశ్వరరావు, దొరబాబు, గణేష్, రమేష్ , వరప్రసాద్ తదితరులు మాట్లాడుతు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వాటిని సరి చేసుకోవాల్సింది పోయి పత్రికల పైనా వాటి సంపాదకుల పైనా ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే అన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడులు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే పత్రికల గొంతు నొక్కేయాలనుకోవడం చాలా దారుణమన్నారు. ఇలాంటి దారుణాలు ఆపకపోతే జర్నలిస్టులంతా రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆందోళనలు చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

### పోలీసు సోదాలు సరికాదు



ఏవైనా కేసులు ఉంటే వాటికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు చేసుకోవాలి. అదికూడా నిర్దిష్ట సమాచారం ఇచ్చి కోర్టు అనుమతితో చేయాలి. ధనుంజయరెడ్డి నివాసంలోకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు చొరబడి గంటల తరబడి వేధింపులకు దిగడం సరికాదు. ప్రభుత్వాలకు తమ వార్తల ద్వారా ప్రజల బాధలను, ప్రభుత్వ వైఫల్యాలను వివరించే ప్రత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం దురదృష్టకరం.

– ముమ్మిడి లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, పిఠాపురం

# ఆకుపచ్చ రంగులో తాగునీరు

- ఫిల్టర్ ప్లాంటును పరిశీలించిన అధికారులు
- స్వచ్ఛమైన తాగునీరు ఇస్తాం



సామర్లకోట ఫిల్టరు చెరువును పరిశీలించిన కమిషనర్ తదితరులు

**సామర్లకోట:** మున్సిపల్ కుళాయిల నుంచి ఆకుపచ్చ రంగులో తాగునీరు వస్తుండడంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కమిషనర్ ఎ.శ్రీవిద్య శుక్రవారం ఫిల్టర్ ప్లాంటును పరిశీలించి డీఈ కె.శశిధర్, ఏఈ ఎం.రమేష్‌లతో చర్చించారు. గోదావరి కాలువలో నీటిని కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట ప్రజలు తాగునీటికి ఉపయోగిస్తున్నారు. ఈ మేరకు కాకినాడ రోడ్డులో లాకుల వద్ద సాంబమూర్తి రిజర్వాయర్ ద్వారా పెద్దాపురం మున్సిపాలిటీ, కాకినాడ కార్పొరేషన్‌కు నీరు చేరుతుంది. అదే విధంగా ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున ఫిల్టర్ చెరువు ద్వారా సామర్లకోట ప్రజలకు తాగునీరు చేరుతుంది. గోదావరి జలాలనే రెండు చెరువులకు నింపడం వలన సాంబమూర్తి రిజర్వాయర్‌లో ఉన్న నీరు ఎలా శుద్ధి చేస్తున్నారో అధికారులు పరిశీలించారు. సాంబమూర్తి రిజర్వాయర్‌లో నీరు కలిసేలా బోట్లకు ఎరియేటర్లు ఏర్పాటు చేశారు. దాంతో చెరువులో నాచు కట్టడం లేదు. అయితే నాగార్జున చెరువులో నీరు స్థిరంగా ఉండడం వల్ల చెరువులో నీరు నాచు రంగులోనికి మారుతున్నట్లు అధికారులు గమనించారు. ఈ చెరువులో నీటిని ఎక్కువ భాగం నాగార్జున ఎరువుల ఫ్యాక్టరీ యజమాన్యం ఉపయోగిస్తుంది. అయితే ప్రస్తుతం ఆ ఫ్యాక్టరీ నీటిని వాడక పోవడంతో నీరు నాచు రంగులోనికి మారి ఎంత ఫిల్టరు చేసినా ఫలితం లేక అదే రంగులో నీరు ప్రజలకు సరఫరా అవుతుంది. నాగార్జున చెరువులో నీటి కదలిక వచ్చేలా ఎరియేటర్లు అమర్చిన బోట్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన పరిమాణంలో క్లోరిన్, ఆలమ్ వేసి శుద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. నాగార్జున చెరువులో కాపర్ సల్ఫేట్ ఏ మేరకు కలిపితే ఉపయోగం ఉంటుందని ఆలోచిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఆర్వో నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు.

# బార్ అధ్యక్షుడిగా ఆరోసారి మేరుగు

**పిఠాపురం:** పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేరుగు రాజారావు ఆరోసారి ఎన్నికయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది పిట్ల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా గౌతు రాజు రెండో సారి ఎన్నికయ్యారు. శుక్రవారం పిఠాపురం కోర్టుల సముదాయంలో అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. అంతకు ముందు బార్ అసోసియేషన్ పాలక మండలిలో ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ముమ్మిడి శ్రీనివాస్, స్పోర్ట్సు కార్యదర్శిగా ఎంవీవీఎస్ సత్యనారాయణ, లైబ్రరీ కార్యదర్శిగా జీఎస్ భాస్కరాచార్యులు, లేడీ రిప్రజంటేటివ్‌గా ఎం సత్యవాణిశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సీహెచ్ ప్రేమ్‌జీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రావుల రమేష్, జీవీవీ సత్యనారాయణ, మహిళా సభ్యురాలిగా అల్లాడ గీత, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణదొర, రావుల రమణారావు, కొత్త సురేష్ వ్యవహరించారు. నూతన అసోసియేషన్ సభ్యులను పలువురు న్యాయవాదులు అభినందించారు.

# ఆటపాటలతో వేసవి శిబిరం



వేసవి శిక్షణలో ఆటలు నేర్చుకుంటున్న విద్యార్థులు

**పెద్దాపురం:** స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఆటపాటలు నేర్పారు. క్లబ్ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ విద్యతో పాటు ప్రశ్నించే తత్వం, ప్రతి అంశాన్నీ పరిశోధించే తీరును అలవరచుకోవాలన్నారు. అనంతరం తెప్పల యోగేష్ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వగా లోకేష్, అజయ్‌కుమర్‌లు తెలుగు పద్యాలు, తెలుగు పాటలు నేర్పించారు. శిబిరం నిర్వాహకులు రొంగల అరుణకుమార్, కోశాధికారి కూనిరెడ్డి రవికుమార్, పవన్, సాయి, బంగారం, మణికంఠ, కుమారి, అమృత, నమ్రత, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్

**కాకినాడ రూరల్:** భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళిక సంఘ సభ్యురాలిగా సేవలు అందించిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రముఖ సంఘసంస్కర్త అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె బాల్యం నుంచి ప్రతిభాపాటవాలను కనపరిచేవారన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించిన ఆమె 1981 మే 9న నరసన్నపేటలో కాలం చేశారని నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అనస్థీషియా హెచ్‌ఓడీగా ప్రసన్నకుమార్



డాక్టర్ ప్రసన్నకుమార్‌కు అభినందనలు తెలుపుతున్న నర్సుల బృందం

**కాకినాడ క్రైం:** కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అనస్థీషియా డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా డాక్టర్ గుడాల ప్రసన్నకుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రసన్నకుమార్‌ను వివిధ విభాగాల హెచ్‌వోడీలు సహా డిపార్టుమెంట్‌లోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు.

## భారతీయుల ఆత్మగౌరవం 'సిందూర్'

**బోట్‌క్లబ్:** పహల్గాంలో ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత్ జవాన్లు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించి భారతీయులు ఆత్మ గౌరవం నిలబెట్టారని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కింతాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం భారత జవాన్లకు సంఘీభావం ప్రకటించారు. సంఘ నాయకులు కింతాడ సత్యనారాయణ, స్వయంవరం శ్రీనివాస్ ఆవుపాటి ఉమాశంకర్ పాల్గొన్నారు.

# ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అభినందన



ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లోని ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పి.నల్లబాబు, డి.శివశంకర్‌లను కమాండెంట్ ఎం.నాగేంద్రరావు అభినందించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా సీఎస్ఎస్ఆర్ కాంపిటేషన్‌లో ఆంధ్రప్రదేశ్ ఎస్‌డీఆర్ఎఫ్ మూడో స్థానంలో నిలిచింది. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందంలో ఏపీఎస్పీ నుంచి పాల్గొన్న వారిని కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది ప్రశంసించారు.

# గంగమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

- గోవతాళ్ల రూపంలో గ్రామదేవత
- రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ



బుట్టలో గోవతాళ్ల రూపంలో గంగమ్మతల్లి

**కరప:** మండలం పెద్దాపురప్పాడు గ్రామదేవత గంగమ్మ జాతర ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ జాతరనే గొల్లల సంబరంగా పేర్కొంటారు. పూర్వకాలంలో గ్రామంలోని గొల్లపల్లి వంశీయుల పొలంలో గోవతాళ్ల రూపంలో భూమిలో దొరికాయని, అప్పటి నుంచి గ్రామ దేవతగా కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గోవతాళ్లను బుట్టలో ఉంచి ఆలయంలో దూలానికి వేలాడదీసి ఉంచుతారు. ఈ గోవతాళ్లనే గంగమ్మతల్లిగా కొలుస్తుంటారు. ఈ జాతరకు 150 గ్రామాల నుంచి గొల్లల కుటుంబాల వారు వచ్చి ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు కళాత్మకంగా తప్పెటగుళ్ల ఆడతారు. ఆ కుటుంబాలకు గ్రామస్తులు అతిథి మర్యాదులు చేస్తారు. జాతరకు నెలరోజుల ముందుగా మేలుకొలుపు పేరుతో ఆహ్వాన పత్రికలు, అమ్మవారి శేష అక్షింతలు పంపించి ఆహ్వానం పలుకుతారు. ఆదివారం గంగమ్మతల్లి ఆలయంలో దూలానికి వేలాడదీసిన గోవతాళ్లను కిందకు దించి, ప్రత్యేక పూజలు చేస్తారు. సోమ, మంగళవారాల్లో గ్రామంలో అమ్మవారిని ఊరేగించి, గ్రామపొలిమేరలో మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలో పాడిపంటలు వృద్ధిచెంది, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని గ్రామస్తులు కోరుకుంటారు. మూడోరోజు మంగళవారం సాయంత్రం గోవతాళ్లను బుట్టలో భద్రపరచి, గుడిలో వేలాడదీయడంతో జాతర ముగిస్తుంది. జాతరకు వచ్చే భక్తులు గొల్లలకు మూడు రోజుల పాటు అన్నదానం చేస్తారు. జాతరలో నృత్యాలతో, తప్పెటగుళ్ల సందడితో అలరించిన గొల్లలకు గొల్లపల్లి వంశీయులు బహుమతులు అందజేస్తారు.

# పంచాయతీల జనాభా, ఆదాయ వివరాలపై సమీక్ష

**కరప:** మండల పరిధిలోని గ్రామ పంచాయతీల జనాభా, వారి ఆదాయం తదితర వివరాలతో జాబితా తయారుచేసి, వెంటనే ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు సిబ్బందిని కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై, వివిధ అంశాలపై చర్చించి, అనుసరించాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. గ్రామ పంచాయతీల రీ-గ్రేడింగ్ జరగనుందని, అందుకు కావాలసిన జాబితాలను ఇవ్వాలన్నారు. దాని ఆధారంగా పంచాయతీలను నాలుగు గ్రేడులుగా విభజిస్తారన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణలో తడి, పొడిచెత్త విడి, విడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలని, కంపోస్టు ఎరువు తయారీ, స్వర్ణ పంచాయతీ పోర్టల్, స్వామిత్వ సర్వే తదితర విషయాలపై డిప్యూటీ ఎంపీడీఓ సమీక్షించారు.